పెల్లుబికిన భక్తిపారవశ్యం

కుల, మతాలకు అతీతంగా జరుపుకునే మొహర్రం వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు శనివారం భక్తుల నుంచి మొక్కుబడులు చెల్లించుకున్న పీర్ల స్వాములు ఏటికి తరలివెళ్లారు. యువకులు వివిధ వేషధారణలతో ఆకట్టుకోగా చిన్నా పెద్దా తేడా లేకుండా పీర్ల ఊరేగింపుల్లో సావుసోని ఆడారు. మహిళలు నిండు కుండ నీళ్లు, చక్కెర, కొబ్బెర సమర్పించి స్వాములకు చదివింపులు చేయించారు. భారీ ఊరేగింపులతో గ్రామాలు భక్తిపారవశ్యంతో మునిగిపోయాయి. ప్రజలు స్వాములను ఊర్ల చివర వరకు సాగనంపారు. ఏటిలోకి తరలించి విషాద గీతాలతో మత పెద్దలు ఇళ్లకు చేరుకోవడంతో మొహర్రం వేడుకలు ముగిశాయి.


పెద్దకడబూరు మండలం హెచ్.మురవణి లో భారీ జనసందోహం మధ్య ఊరేగుతున్న పీర్లు

- ఊరేగింపులతో ఏటికి తరలిన పీర్లు
- వివిధ వేషధారణలతో ఆకట్టుకున్న యువకులు
- విషాద గీతాలతో వెనుదిరిగిన మత పెద్దలు

కొనసాగిన ఆచారం

కౌతాళం: కౌతాళంతో పాటు బదినేహాల్, ఉప్పరహాల్, ఉరుకుంద, ఎరిగేరి, నదిచాగి, సుళేకేరి, బంటకుంట, గుడికంబాలి, చూడి, చిరుతపల్లి, మల్లనహట్టి గ్రామాల్లో మొహరం వేడుకల్లో చివరి రోజు దఫన్(ఏటికి సాగనంపడం) కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కౌతాళంలో నగార బండీ ఊరేగింపు, లేవడి(బురుగులు పంపిణీ) కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అనంతరం పీర్లు జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు చేరిన తర్వాత ఊరేగింపు ప్రారంభమైంది. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఖర్బాలా మైదానంలో పీర్లను ఏటికి తరలించడంతో వేడుకలు ముగిశాయి.

ఈరన్న స్వామి సన్నిధిలో పీర్ల దేవుడు

ఉరుకుంద గ్రామంలోని పీర్ల దేవుడు మొహర్రం తెల్లవారుజామున ఈరన్న స్వామి ఆలయంలోకి చేరుకున్నాడు. అర్చకులు పీర్ల దేవుడికి పూజలు చేసిన అనంతరం ఈరన్న స్వామికి పూజలు చేపట్టి మహామంగళహారతి ఇచ్చారు. ఈ ఆనవాయితీ ఏళ్ల తరబడి సాగుతూ మతసామరస్యానికి ప్రతీగా నిలుస్తోంది.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

కోసిగి/పెద్దకడబూరు: స్థానిక పెద్ద మసీదు సమీపంలోని చావిళ్ల పీర్లు, సిద్దప్ప పాళెంలో నూరాణీ సున్నీ మజిద్, కుమ్మరి వీధి చావిళ్ల పీర్లు ఊరేగింపు వెళ్లి చౌడమ్మ వీధిలో కలుసుకుని ఏటికి తరలాయి. ఊరేగింపులో భక్తులు నిండుబిందెలతో పీర్ల దేవుళ్ల పాదాలకు పోసి దర్శించుకున్నారు. యువకులు అలాయి బలాయి ఆడుతూ సావుసేన్ సద్దాసేన్ అంటూ ముందుకు సాగారు. తిరిగి పెద్ద మసీదు సమీపంలోని పెద్ద బావి వద్దకు చేరుకుని (దఫాన్ ఏటికి సాగనంపడం)కార్యక్రమం నిర్వహించడంతో మేడుకలు ముగిశాయి. అలాగే చింతకుంట, పల్లెపాడు, చిన్నభూంపల్లి, మూగలదొడ్డి వందగల్లు, నేలకోసిగి, తుంబిగనూరు, సాతనూరులతో పాటు వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రశాంతం ముగిశాయి. పెద్దకడబూరు మండలంలో మొహర్రం వేడుకల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పీకలబెట్ట గ్రామంలో తిక్కతాత పీర్లను ఎత్తే జుబేరుతాత తెల్లవారుజామున ఇంటి నుంచి ఊరేగింపుగా పీర్ల చావిడి వద్దకు చేరుకున్నాడు. వందలాది మంది భక్తుల మధ్య అగ్నిగుండంలోని ఎర్రటి నిప్పులపై దుప్పటి వేసుకొని కూర్చున్నాడు. రొట్టెలను కాల్చి ప్రజలను ఆశ్చర్యపరిచారు.

మంత్రాలయం మండలంలో..

మంత్రాలయం/రూరల్: మండల కేంద్రం మంత్రాలయంతో పాటు మాధవరం, వగరూరు, రచ్చుమర్రి, తుంగభద్ర, మాలపల్లి తదితర గ్రామాల్లో పీర్లను ఏటికి సాగనంపారు. మంత్రాలయం సంతమార్కెట్‌లోని ఈద్గా వద్ద నుంచి తుంగభద్ర నది వరకు ఊరేగించారు. అక్కడ ఏటికి సాగనంపడంతో మేడుకలు ముగిశాయి.

ప్రశాంతంగా ముగిసిన మొహర్రం వేడుకలు


పర్వతాపురంలో పీర్లదేవుళ్లను ఊరేగింపుగా యేటికి తీసుకెళ్తున్న దృశ్యం

ఆదోని అర్బన్/రూరల్: మండలంలో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదోనితో పాటు పర్వతాపురం, పెద్దహరివాణం, పెద్దతుంబళం, కపటి, మదిరె, నాగనాథనహళ్లి, ఢణాపురం, అలసందగుత్తి, దొడ్డనగేరి, దిబ్బనకల్, సలకలకొండ, నాగలాపురం, బైచిగేరి, సంతెకూడ్లూరు, ఇస్వీ, విరుపాపురం, సాదాపురం తదితర గ్రామాల్లో శనివారం పీర్లను ఏటికి సాగనంపారు. పీర్ల దేవుళ్లకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపుగా ఏటికి తరలించడంతో వేడుకలు ముగిశాయి.


ఢణాపురంలో పీర్లదేవుళ్లను యేటికి తీసుకెళ్తున్న దృశ్యం


కోసిగిలో పీర్లు ఊరేగింపులో కిక్కిరిసిన భక్త జనసందోహం


కౌతాళంలో పీర్ల ఊరేగింపు

క్లుప్తంగా

బోసిపోయిన టీడీపీ మహాశక్తి యాత్ర


జనం లేక వెలవెలబోతున్న యాత్ర

మంత్రాలయం: టీడీపీ చేపట్టిన మహాశక్తి యాత్రను ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బీటీ నాయుడు, ఇన్‌చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి, అబ్జర్వర్ శివబాల శనివారం ప్రారంభించారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్ర సర్కిల్‌లో మహాశక్తి యాత్రకు జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభించే సమయంలో జనాలు లేక పోవడంతో యాత్ర బోసిపోయింది. కార్యక్రమంలో నాయకులు పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, నరవ రమాకాంతరెడ్డి, పన్నగ వెంకటేష్‌స్వామి, అశోక్‌రెడ్డి, నరసింహులు, సుంకప్ప, నరసింహ, యేబు, నాగరాజు, విజయరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

సభను విజయవంతం చేయండి

ఆదోని రూరల్: ఆగస్టు 6న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలులో జరిగే సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మణికంఠ, పట్టణ నాయకులు మన్మోహన్, రామంజి, నరసింహ, సుధాకర్, గిరి కోరారు. శనివారం పట్టణంలోని కిలిచినపేట తదితర వార్డుల్లో వారు పర్యటించి సభకు హాజరు కావాలని సూచించారు.

రేపు శాంతి ర్యాలీ


మాట్లాడుతున్న పాస్టర్ ఎజ్రా శ్రీధర్


ఆదోని సెంట్రల్: క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 31న శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు పాస్టర్ ఎజ్రా శ్రీధర్ తెలిపారు. శనివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్ ఘటనను ఖండిస్తూ నిర్వహించనున్న శాంతి ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు దేవిశెట్టి ప్రకాశ్, నీలకంఠప్ప, దస్తగిరి నాయుడు, మహిళా సంఘం సభ్యులు సుజ్ఞానమ్మ, పాస్టర్లు అల్బర్ట్, బెనర్జీరాజు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లు విజయవంతం


కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారితో అవోపా సభ్యులు

ఆదోనిఅర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) ఆధ్వర్యంలో 125 మంది వృద్ధులకు ఈనెల 23న నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు చేయించి శనివారం ఆదోనికి తీసుకొచ్చారు. రాకపోకల రవాణా చార్జీలు, భోజన, వసతి ఖర్చులు పట్టణానికి చెందిన దాత ఎస్ఆర్‌వి నగేష్‌కాకుబాళ్ భరించడంతో వారికి వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. అవోపా పట్టణ అధ్యక్షులు వంకదారి శ్రీనాథ్ గుప్తా, కార్యదర్శి మిర్యాల శ్రీధర్, మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు బుదూర్ సంగీత, మమతాశ్రీ, కోశాధికారి ప్రతాప్, హిమబిందు, సభ్యులు వంకదారు గీత, లావణ్య పాల్గొన్నారు.

గూగూడు కుల్లాయి స్వామికి 1.10 కిలోల వెండి విరాళం


వెండి తోరణాలు అందజేస్తున్న దాతలు

మద్దికెర: గూగూడు కుల్లాయి పీర్ల స్వామికి మండల కేంద్రానికి చెందిన కుమ్మర పులికొండప్ప, వారి కుమారులు రామాంజనేయులు, ఆంజనేయులు, అంజనీప్రసాద్, శ్రీధర్, హనుమంతు రూ.లక్ష విలువ చేసే 1.10 కిలో వెండి తోరణాలుతో పాటు అర కిలో పంచలోహపు కవచాన్ని శనివారం విరాళంగా అందజేశారు.

మద్దికెరలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపండి

మద్దికెర: మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ పునరుద్ధరించాలని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు డీఆర్ఎం (రైల్వే డివిజనల్ మేనేజర్) మనీష్ అగర్వాల్‌ను కోరారు. శనివారం గుంతకల్లులో డీఆర్ఎంను ఆయన కార్యాలయంలో కలిశారు. కరోనా సమయంలో స్టాపింగ్ ఎత్తేయడంతో ప్రయాణికులు తీ వ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మొలగవెల్లి సమీపంలో బ్రిడ్జి ఎత్తు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్లను రీజినల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్తానని డీఆర్ఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ బస్ స్టాప్ నుంచి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కాలనీ వరకు టెక్నికల్ ఇంప్రూవ్‌మెంట్ వర్క్ ఉన్నందువల్ల ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీ1 సబ్‌స్టేషన్ ఏఈ నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు, వ్యాపారులు గమనించి సహకరించాలని కోరారు.

రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

ఆదోని సెంట్రల్: ఆదోని–ఇస్వీ ఆర్ఎస్ మధ్యలో కిలోమీటరు నంబర్ 495/26–28 డౌన్ లైన్‌లో ట్రాక్ వద్ద 70 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు రైలు నుంచి జారీ పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే ఎస్ఐ రామస్వామి అక్కడికి చేరుకుని పరిశీలించారు. చేతిపై హిందీలో కేసరి అనే పచ్చబొట్టు ఉంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెద్దకడబూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు తమ శాఖల నివేదికలతో హాజరు కావాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొని మండలం అభివృద్ధిలో తమవంతు సహకారం అందించాలని కోరారు.

ఘనంగా బీటీఏ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని అర్బన్/సెంట్రల్: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బీటీఏ జిల్లా గౌరవాధ్యక్షుడు డి.రామశేషయ్య పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు జి.భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా బాధ్యులు లక్ష్మన్న, రాము, ఉపాధ్యాయులు అమల్‌నాథ్ చిరంజీవి, జనార్దన్, రామన్న, వేణుగోపాల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య


లింగన్న (ఫైల్)

దేవనకొండ: మండలంలోని బండగట్టు గ్రామానికి చెందిన శెట్టి బలిజ లింగన్న(76) శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. లింగన్న కొంతకాలంగా టీబీ, ఆయాసంతో బాధపడుతున్నాడు. ఈ విషయమై మనోవేదనకు గురై పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. మృతునికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

తుగ్గలి: పురుగు మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని కోతికొండలో చోటుచేసుకుంది. తుగ్గలి పోలీసులు తెలిపిన వివరాలు.. కోతికొండకు చెందిన కులుమాల వెంకటేష్‌కు ఏడేళ్లక్రితం ఆస్పరికి చెందిన లక్ష్మి(25)తో వివాహమైంది. వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. లక్ష్మి కొంత కాలంగా కడుపునొప్పి, తలనొప్పితో బాధపడుతుండేది. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పత్తికొండకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి సోదరి మారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు శనివారం ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


రామాంజనేయులు(ఫైల్)

గోనెగండ్ల: మండల పరిధిలోని అలువాల గ్రామానికి చెందిన కురువ రామాంజనేయులు(27) బైక్ అదుపుతప్పి నీటి గుంతలో పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు ఐరన్‌బండ గ్రామంలోని శుభకార్యానికి హాజరయ్యేందుకు శుక్రవారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. కులుమాల గ్రామ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న నీటి గుంతలో పడిపోయి ఊపిరాడక మృతిచెందాడు. శనివారం ఉదయం అటుగా వెళ్తున్న వారు గమనించి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి భార్య సరస్వతి, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు బిల్లేకల్లు కూరగాయల మార్కెట్ వేలం

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు కూరగాయాల మార్కెట్ వేలం ఈనెల 31న నిర్వహించునున్నట్లు సర్పంచ్ శ్రీను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.లక్ష డిపాజిట్, రూ.లక్ష సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు.

సీనియర్ పాత్రికేయుడు మృతి

దేవనకొండ: సీనియర్ పాత్రికేయుడు వాల్మీకి శివరాములు(52) అనారోగ్యంతో కర్నూలు ఆస్పత్రిలో శనివా రం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జర్నలి స్టు సంఘం నాయకులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల ప రిధిలోని కె.వెంకటాపురం గ్రామానికి చెందిన శివరాముడు గతంలో పలు దినపత్రికల్లో పనిచేశాడు.

జీపును ఢీకొన్న లారీ

వెల్దుర్తి: స్థానిక హనుమాన్ జంక్షన్ స్పీడ్ బ్రేకర్ వద్ద స్లో అయిన జీపును వెనుక నుంచి లారీ ఢీకొంది. కర్నూలు నుంచి డోన్‌వైపు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో జీపు బోల్తాపడగా అందులోని అనంతపురానికి చెందిన రామచంద్ర, అమర్ గాయపడ్డారు. హైవే పోలీసులు క్షతగాత్రులను డోన్ 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

యువకుడికి గాయాలు


గాయపడిన ఆదినారాయణ

ఎమ్మిగనూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక గాంధీనగర్‌కు చెందిన యువకుడు ఆదినారాయణ బైక్‌పై ఎల్ఎల్‌సీ వద్దకు బయలుదేరాడు. అదేదారిలో ముదు వెళ్తున్న ట్రాక్టర్ అగ్నిమాపక కేంద్రం సమీపంలో అకస్మాత్తుగా మలుపు తిప్పటంతో బైక్ ట్రాక్టర్ ట్రాలీకి ఢీకొని ఆదినారాయణ ఎగిరి పడ్డాడు. ప్రమాదంలో ఎడమ కాలు విరిగి, తలకు, శరీర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. పోలీస్ రోడ్ సెఫ్టీ వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు.

తప్పిన ప్రమాదం



ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని ఎర్రకోట – సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీ మధ్యలో శనివారం తెల్లవారు జామున సిమెంట్ లోడ్ లారీ ప్రమాదవశాత్తూ రోడ్డుపక్కకు వెళ్లటంతో బురదలో ఇరుక్కుపోయింది. లారీ ఒకవైపు ఒరిగి పోవటంతో డ్రైవర్ ఖాన్ అప్రమత్తమై కిందకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది.

ఆగస్టు 1 బిణిగేరి కూరగాయాల మార్కెట్ వేలం

మండలంలోని బిణిగేరి గ్రామ పంచాయతీకి సంబంధించి ఆగస్టు 1న కూరగాయలు మార్కెట్ వేలం నిర్వహించునున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ వెంకటేష్ శనివారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్, రూ.50 వేల సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు.

రేపు గురుకులంలో స్పాట్ అడ్మిషన్

కృష్ణగిరి: కంబాలపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్‌లో మిగిలిన సీట్లకు ఈనెల 31న స్పాట్ అడ్మి షన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన బాలికల సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయని, పదో తరగతిలో రెగ్యులర్ పాసైన వారే అర్హులన్నారు.

వెల్దుర్తి: స్థానిక డాక్టర బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో ఇంటర్‌లో ప్రవేశాలకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ గ్రూపులో ఎస్సీలకు 4 సీట్లు, ఎస్టీలకు 2 సీట్లు, ఓసీలకు ఒక సీటు ఖాళీగా ఉందన్నారు. 10వ తరగతి రెగ్యులర్ పాసైన బాలికలు ఒరిజినల్ టీసీతో 31న ఉదయం 11 గంటలకు గురుకులంలో హాజరు కావాలన్నారు. పదవ తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రైల్వే స్టేషన్ తనిఖీ

ఆదోని సెంట్రల్: స్థానిక రైల్వే స్టేషన్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) మనీష్ అగర్వాల్ శనివారం తనిఖీ చేశారు. అమృత భారత్ ప్రాజెక్టు కింద రైల్వే స్టేషన్‌కు నిధులు మంజూరయ్యాయి. వికలాంగులు, వృద్ధులకు అసౌకర్యంగా ఉన్న మెట్ల మార్గంతో పాటు లిఫ్ట్ ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. గూడ్స్ షెడ్డు వద్ద అస్తవ్యస్తంగా ఉన్న రహదారిని, ప్లాట్ ఫామ్‌లను పరిశీలించారు.

డిస్‌ప్లే బోర్డుల నిర్వహణలో అలసత్వం వద్దు

ప్రయాణికుల సౌకర్యార్థం రైళ్ల రాకపోకలను తెలియజేసే డిస్‌ప్లే బోర్డుల నిర్వహణలో అలసత్వం వద్దని కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరగా మరమ్మతులు చేపట్టాలని డీఆర్ఎం మనీష్ అగర్వాల్ అధికారులకు సూచించారు. రైళ్ల రాకపోకలు, స్టేషన్‌లోని సౌకర్యాలను ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.


స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఆర్ఎం మనీష్ అగర్వాల్

వాసవీ ఆలయంలో హోమాలు


హోమం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య భక్తులు


పూజలందుకున్న వాసవీకన్యకా పరమేశ్వరిదేవి

ఆదోనిఅర్బన్: పట్టణంలోని షరాఫ్‌బజార్‌లో వెలిసిన నగరేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అధికమాసం సందర్భంగా శనివారం ప్రత్యేకహోమాలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, గోపూజ, పుణ్యాహవచనం, వృత్తికగనం, కంకణ ధారణ, దేవానాంది, కలశ స్థాపన అనంతరం గణపతి, రుద్ర, వృషసూక్తం, లక్ష్మి, సర్పసూక్త హోమాలు వేదపండితుల చేత భక్తులు చేశారు. ముందుగా న్యకాపరమేశ్వరిదేవికి పంచామృతాభిషేకం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్ర పారాయణం చేపట్టారు.


కలుపు మొక్కలు తొలగిస్తున్న కూలీలు


వేరుశనగ పైరులో దెంత పడుతున్న రైతులు

వర్షం రాకతో పైర్లకు జీవం

ఇటీవల కురిసిన వర్షాలకు పైర్లు కళకళలాడుతున్నాయి. మండలంలో ఏటా ఖరీఫ్‌లో 14,250 హెక్టార్లు సాగులోకి వస్తాయని వ్యవసాయాధికారులు తెలిపారు. ఇటీవల విస్తారంగా వర్షాలు కురువడంతో పంటలకు జీవం పోసింది. అత్యధికంగా పత్తి, వేరుశెనగ, మిరప, ఉల్లి, కంది, వరి సాగవుతోంది. వ్యవసాయ బోర్ల కింద ముందస్తుగా సాగు చేసుకున్న పంటల్లో రైతులు కలుపు మొక్కలు తొలగిస్తున్నారు. కొందరు రైతులు కాడెద్దులతో దెంత పట్టడం, మందులు పిచికారీ చేయడం, విత్తనాలు మొలకెత్తని ప్రాంతంలో మరోసారి విత్తనాలు నాటుకోవడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.

–కోసిగి


కళకళాడుతున్న పత్తి పైరు,


బోరుబావికి కింద ముందుగా సాగుచేసుకున్న ఆముదం పంట,


ఉల్లి పంట సాగుచేసుకున్న రైతులు